సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 26 । జనవరి । 2024



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.



తమ్ముని చేతిలో అన్న హతం

క్షణికావేశంలో తమ్ముడు కర్రతో దాడి చేయడంతో అన్న మృతి చెందిన సంఘటన తనకల్లు మండలంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది.

IIలో

గరిష్టం/కనిష్టం
34.5°/ 16.4°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పట్టుగూళ్ల రాకతో మార్కెట్ కళ కళ



హిందూపురం మార్కెట్‌లో పట్టు గూళ్ల విక్రయాలు

హిందూపురం అర్బన్: పట్టణంలోని పట్టు గూళ్ల మార్కెట్ 8 రోజుల తరువాత గురువారం తెరుచుకుంది. దీంతో మార్కెట్ కళ కళలాడింది. వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు 3,266 కిలోల పట్టు గూళ్లు వచ్చాయి. మార్కెట్‌లో కిలో బైవోల్టిన్ పట్టు గూళ్ల కనిష్ట ధర రూ.266, గరిష్ఠం రూ.525, సగటు రూ.482 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి లక్ష్మిరెడ్డి తెలిపారు.

హిందూపురం మార్కెట్‌కు 440 క్వింటాళ్ల చింతపండు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 440 క్వింటాళ్ల చింతపండు వచ్చింది. మార్కెట్‌లో కరిపుళి (ప్రథమ శ్రేణి) రకం క్వింటా రూ.14 వేలు - రూ. 24 వేల వరకు, ఫ్లవర్ (ద్వితీయ శ్రేణి) రకం రూ.8 వేలు -రూ.12,500 వరకూ పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. చింతపండు మార్కెట్‌కు తక్కువ రావడంతో వ్యాపారులు పోటీపడి కొనుగోళ్లు చేశారు.


బాలల బీమా చెక్కుల పంపిణీ



విద్యార్థి తల్లికి చెక్కు అందజేస్తున్న ఏపీసీ వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముగ్గురు విద్యార్థుల కుటుంబాలకు బాలల బీమా చెక్కులు పంపిణీ చేశారు. యల్లనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి జి.కిరణ్, అనంతపురం రూరల్ మండలం పాములాయి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న యు.చరణ్య, శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థి సి.శ్రీధర్ వివిధ సందర్భాల్లో ప్రమాదవశాత్తూ మృతి చెందారు. వీరికి బాలల బీమా పథకం కింద ఒక్కొక్కరికి రూ. 25 వేలు మంజూరైంది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను విద్యార్థుల తల్లులకు గురువారం సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పెద్దయ్య పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్



అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, కుటుంబ తగాదాలు, మోటారు వాహనాల ప్రమాద కేసులు, చెక్ బౌన్స్ కేసులు, పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ, మున్సిపల్ పన్ను కేసులు, ప్రిలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రిహార్సల్స్‌లో భాగంగా గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



ఎస్పీకి వందనం చేస్తున్న పోలీస్ జాగిలం

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

- పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి
- 521 మంది అధికారులకు ప్రశంసాపత్రాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో నేడు గణతంత్ర వేడుకలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ప్రశాంతి గ్రామం వద్ద ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయి. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ప్రముఖులు ,పెద్ద ఎత్తున ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, ఇతర జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు ఆహ్వానితులు ఆసీనులైన తర్వాత 8.50 గంటలకు ఎస్పీ మాధవరెడ్డి పరేడ్ గ్రౌండుకు వస్తారు. 8.55 గంటలకు కలెక్టర్ అరుణ్‌బాబుకు ఎస్పీ స్వాగతం పలుకుతారు. 9 గంటలకు కలెక్టర్ అరుణ్‌బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పరేడ్, సాయుధ దళాల గౌరవం స్వీకరిస్తారు. 9.30 గంటలకు జిల్లా ప్రగతి నివేదికపై కలెక్టర్ ప్రసంగిస్తారు. తర్వాత ప్రగతి రథాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ప్రదర్శనకు 14 శకటాలను, 10 స్టాల్స్‌ను సిద్ధం చేశారు. 10.45 గంటలకు విశిష్ట సేవలందించిన 521 మంది అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. 11.10 గంటలకు స్టాల్స్‌ను సందర్శిస్తారు. అనంతరం జాతీయ గీతాలాపనతో గణతంత్ర వేడుకలు ముగియనున్నాయి.

రిహార్సల్స్ పరిశీలన..

పుట్టపర్తి టౌన్: గణతంత్ర వేడుకల్లో భాగంగా గురువారం స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన రిహార్సల్స్‌ను ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగానే సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పరేడ్ రిహార్సల్స్ అతిథుల గ్యాలరీలు, స్టాల్స్, డాగ్ స్క్వాడ్ విన్యాసాలు పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అతిథులు, ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు టైటాస్, నారాయణ పాల్గొన్నారు.

సాగులోకి 2 లక్షల ఎకరాలు

- కృష్ణా జలాలతో పుట్టపర్తిని సస్యశ్యామలం చేస్తాం
- 7వ రోజు రైతు విజయ సంకల్ప పాదయాత్రలో ఎమ్మెల్యే దుద్దుకుంట



రైతులు, ప్రజలతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతూ యాత్రలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే కార్యక్రమం పూర్తయితే సుమారు 2 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. ఇప్పటికే 3 టీఎంసీల నికర జలాలు సాధించడంతో నీటి కొరత ఉండదని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రైతులతో కలిసి వైఎస్సార్ రైతు సంకల్ప విజయ యాత్ర 7వ రోజు విజయవంతంగా నిర్వహించారు. గురువారం ఉదయం పుట్టపర్తి రూరల్ మండలం నిడిమామిడి, ఇరగరాజుపల్లి గ్రామాల మీదుగా కొత్త చెరువు మండలంలోని చెన్నరాజుపల్లి, యర్రబల్లి, బండ్లపల్లి, నారాయణపురం, బండ్లపల్లి క్రాస్, అప్పలవాండ్లపల్లి, పోతులకుంట, మరకుంటపల్లి, తలమర్ల వరకూ సుమారు 22 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేశారు. పాదయాత్రలో అడుగడుగునా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు, యువత విచ్చేసి సంఘీభావం తెలిపి పూలమాలలు, బొకే అందజేస్తూ బాణసంచా కాలుస్తూ ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొన్నారు.

వలసలు, ఆత్మహత్యలు ఉండవు..

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి మండల పరిధిలోని గాజులపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే పుట్టపర్తి మండలంలోని గ్రామాలతో పాటు కొత్త చెరువు మండలంలోని చాలా గ్రామాలకు తాగు, సాగు నీరు అందుతాయన్నారు. నిరంతరం కృష్ణా జలాలతో పంటలు సాగవుతాయన్నారు. ఇప్పటికే అన్ని అనుమతులు పొందామని నిర్మాణ పనులు ప్రారంభం కాగానే పైప్‌లైన్లు వేసుకుంటూ పోతారన్నారు. 2020లోనే ప్రభుత్వాన్ని ఒప్పించి పుట్టపర్తి నియోజక వర్గానికి 3 టీఎంసీల నికర జలాలను సాధించామన్నారు. వాటితో అన్ని చెరువులనూ నింపుతామన్నారు. చెరువులు, కాలువల్లో నీళ్లుంటే సుమారు 2 లక్షల ఎకరాల వరకూ పంటలు సాగవుతాయన్నారు. మరి కొంత కాలం రైతులు ఓపిక పడితే నియోజకవర్గంలో వలసలు ఉండవని, నిత్యం రైతులు పనులతోనే జీవనోపాధి పొందుతారన్నారు. ఎక్కడా రైతుల ఆత్మహత్యలు ఉండవన్నారు.

పగటి వేషగాళ్లు వస్తారు జాగ్రత్త ...

ఎన్నికల సమయం ఆసన్నం కావడంతో ఇంత కాలం కుంభకర్ణ నిద్ర వహించిన టీడీపీ, జనసేన నాయకులు పగటి వేషాలు వేసుకొని ఊళ్లలోకి వసారని, వారితో కొంత జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మాయ మాటలతో బురిడి కొట్టించేందుకు యత్నిస్తారన్నారు. వాళ్లు గ్రామాల్లో వస్తూనే గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదో అడగండి.. ఇక అక్కడి నుంచి జారుకుంటారన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో తామంతా మంచిగా బతుకుతున్నామని గట్టిగా చెప్పాలన్నారు. ఇప్పటికే వంద శాతం హామీలను నెరవేర్చిన వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఎంపీపీ గాయత్రి రెడ్డెప్పరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాదేవి, మటన్ శంకర్, ఎమ్మెల్యే సతీమణి అపర్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మహబూబ్‌బాషా, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంగడి సోమశేఖర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షులు షాన్‌షట్, శ్యాం సుందర్‌రెడ్డి, దాల్‌మిల్ సూరి, బండ్లపల్లి మాజీ సర్పంచ్ నంజిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు రామచంద్ర, వేమూరి సూర్యనారాయణ, రూప్లానాయక్, తిప్పారెడ్డి, మున్వర్ బాషా, శంకర్‌నారాయణరెడ్డి, గోవిందరెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి షెడ్యూల్ ఇలా...

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఉదయం 8 గంటలకు కొత్తచెరువు మండలం తలమర్ల నుంచి పాదయాత్రను ప్రారంభిస్తారు. ఇరగంపల్లి, వంగంపల్లి, నాగిరెడ్డిపల్లి మీదుగా కొత్తచెరువు చేరుకుంటారు. అక్కడ బహిరంగ సభ అనంతరం బుక్కపట్నం, జానికంపల్లి, పుట్టపర్తి మండలం కర్ణాటకనాగేపల్లికి చేరుకుంటారు. అక్కడే బస చేయనున్నారు.

వైభవంగా గిరి రథోత్సవం



సత్యసాయి శ్రీగిరి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి రూరల్: పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం సాయంత్రం ప్రశాంతి నిలయంలో సత్యసాయి శ్రీగిరి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద అందంగా అలంకరించిన రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగుతూ ఊరేగింపుగా ప్రశాంతి నిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి ,గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్ద బజార్ మీదుగా రథోత్సవం సాగింది. ఈ ఉత్సవంలో దేశ, విదేశీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నలుగురు సీఐల బదిలీ

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న పీ.రమేష్‌రాజాను కొత్తచెరువు యూపీఎస్‌కు, కదిరి అర్బన్‌లో పనిచేస్తున్న డీవీ నారాయణరెడ్డిని అనంతపురం ట్రాఫిక్ సీఐగా బదిలీ చేశారు. అలాగే అనంతపురం ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న సి. వెంకటేష్‌నాయక్‌ను అనంతపురం సీసీఎస్ బ్రాంచ్‌కు, సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న జే హేమంత్‌కుమార్‌ను సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ధర్మవరంలో అభివృద్ధి చేసి చూపించాం

- రూ.5,677 కోట్లతో సంక్షేమాభివృద్ధి
- 93 శాతం జనాభాకు లబ్ధి చేకూర్చాం
- మాతాశిశు ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మాతా శిశు ఆస్పత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: 'ధర్మవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకూ రూ.5,677 కోట్లతో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు ఖర్చు చేశాం. 93 శాతం జనాభాకు లబ్ధి చేకూర్చాం. ఇప్పుడు మాతా శిశువుల కోసం రూ.12.60 కోట్లతో నూతన ఆస్పత్రి నిర్మించాం' అని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్‌లో నూతనంగా నిర్మించిన మాతాశిశు ఆస్పత్రిని గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ప్రతి గదిని పరిశీలించారు. ఆస్పత్రిలోని మెటీరియల్, ఆపరేషన్ మిషనరీలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో ధర్మవరం నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే ఆదర్శ ఎమ్మెల్యేగా నిలిచారన్నారు. అయితే ఇతర పార్టీల నాయకులు ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. వారి మాటలు నమ్మకుండా ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టంకట్టాలని కోరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌తో మాట్లాడి మాతాశిశు ఆస్పత్రి నిర్మాణానికి రూ.12.60 కోట్లు మంజూరు చేయించి త్వరితగతిన ఆస్పత్రి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం నిర్మించిన మాతాశిశు ఆస్పత్రిలో ఓపీ, ఇతరత్రా వైద్యసేవలు అందుతాయని చెప్పారు. పాత ఆస్పత్రిలో ఎమర్జెన్సీ, ఇన్‌పేషెంట్లకు వైద్యం అందుతుందన్నారు. రూ.18.80 కోట్లతో పాత ఆస్పత్రిని నూతనంగా నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామన్నారు. ఎన్నికల అనంతరం పాత ఆస్పత్రి స్థానంలో నూతనంగా ఆస్పత్రిని నిర్మిస్తామని పేర్కొన్నారు. పట్టణంలో గతంలో ఉన్న మూడు అర్బన్ హెల్త్‌సెంటర్లతో పాటు నూతనంగా మూడు అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయించామన్నారు. ప్రతి 30 వేల మంది జనాభాకు ఒక అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయించి వారి ఇంటివద్దనే వైద్యం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులే సరిగ్గా ఉండేవారు కాదన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 13 మంది వైద్యులు, 120 మందికిపైగా సిబ్బంది ఉన్నారని గుర్తుచేశారు. జేబులో ఒక్క రూపాయి లేకపోయినా ఆస్పత్రికి వచ్చి ఉచితంగా వైద్యసేవలు పొందుతుండటం అభివృద్ధి కాదా? అని ప్రశ్నించారు. ఈనాడు పత్రికలో తలా, తోక లేకుండా వార్తలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వైస్ ఛైర్మన్ వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జిల్లాలో 13 మంది ఎస్‌ఐల బదిలీ

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో 13 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం కల్పిస్తూ గురువారం ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పీ. ఇస్మాయిల్‌ఖాన్	గోరంట్ల	వీఆర్ పుట్టపర్తి
జీ.వెంకటేషులు	సీసీఎస్, పుట్టపర్తి	స్పెషల్ బ్రాంచ్, పుట్టపర్తి
ఆర్.నారాయణ	సీసీఎస్, పుట్టపర్తి	స్పెషల్ బ్రాంచ్, పుట్టపర్తి
డీఎస్ వెంకటబసయ్య	కదిరి	పీసీఆర్, పుట్టపర్తి
ఎస్.మగ్బూల్‌బాషా	కదిరి టౌన్	వీఆర్, పుట్టపర్తి
ఎన్.వెంకటరమణ	ఎన్‌పీకుంట	వీఆర్, పుట్టపర్తి
బి. భాస్కర్‌ప్రసాద్‌రాజు	హిందూపురం వన్‌టౌన్	వీఆర్, పుట్టపర్తి
పి. జనార్దన్‌నాయుడు	రామగిరి	సీసీఎస్, పుట్టపర్తి
జి.రమేష్‌బాబు	కియా పీఎస్	నల్లమాడ
కురుబ నరసింహుడు	బుక్కపట్నం	పట్నం
కె. శ్రీధర్	సీకేపల్లి	ఎన్‌పీ కుంట
ఎం . వెంకటరమణయ్య	సీసీఎస్,పుట్టపర్తి	హిందూపురం 2 టౌన్
బత్తల మల్లికార్జునరెడ్డి	ఓడీచెరువు	కే.జీ.పల్లి

ఓటు హక్కు వజ్రాయుధం

- అందరూ వినియోగించుకోవాలన్న కలెక్టర్ అరుణ్‌బాబు



ఓటర్లను సన్మానించిన కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పుట్టపర్తి రూరల్: ప్రతి వ్యక్తి సంపూర్ణ హక్కుల సాధనకు ఓటు హక్కే వజ్రాయుధమని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 82 శాతం మంది ఓటును వినియోగించుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వందశాతంగా నిలిపి జిల్లాను మొదటిస్థానంలో నిలుపుదామని పిలుపునిచ్చారు. ఓటర్ల నమోదు ప్రక్రియ రాబోయే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లు, విభిన్న ప్రతిభావంతులు, పలువురు ఓటర్లను శాలువ, పూలమాలలతో కలెక్టర్ సన్మానించారు. కొత్తగా నమోదైన ఓటర్లకు ఎపిక్ కార్డులను పంపిణీ చేశారు. బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, వీఆర్ఓలకు బహుమతులు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, స్వీప్ అధికారి శివరంగప్రసాద్, తహసీల్దార్ నవీన్‌కుమార్, కలెక్టర్ కార్యాలయ ఎన్నికల అధికారి మైనుద్దీన్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ టోర్నీ

ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. రెండో రోజు ముఖ్యఅతిథులుగా గురువారం ఆత్మీయ ట్రస్ట్ వైస్ చైర్మన్ శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. తొలి సెమీఫైనల్ బాలుర విభాగంలో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ జట్టు, అనంతపురం ఎరా స్కూల్ జట్టు తలపడగా 37–35 పాయింట్లతో ఎస్ఎస్‌బీఎన్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. రెండో సెమీఫైనల్ బాలురు, బాలికల విభాగం మ్యాచ్‌లు శుక్రవారం ఉదయం జరుగుతాయి.

హెచ్‌ఎం తీరుపై విచారణ



హెచ్‌ఎంను, ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈఓ మీనాక్షి

పుట్టపర్తి టౌన్: మండలంలోని బీడుపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పనితీరుపై అధికారులు విచారణ చేపట్టారు. హెచ్‌ఎం లక్ష్మీదేవి దుర్భాషలాడుతూ నిత్యం గొడవ పడుతుండడంతో మూకుమ్మడిగా సెలవుపై వెళ్లేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. ఇదే విషయాన్ని ఇటీవల డీఈఓ మీనాక్షికి వారు లిఖితపూర్వకంగా ఇచ్చారు. దీంతో గురువారం ఉదయం డీఈఓ విచారణ చేపట్టారు. కాగా, గతంలోనూ లక్ష్మీదేవి పనితీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నేరుగా స్పందన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన డీఈఓ, ఎంఈఓపై ఆ సమయంలో ఆమె దురుసుగా ప్రవర్తించింది. తాజాగా ఉపాధ్యాయులతో దురుసుగా ప్రవర్తిస్తుండడంతో వివాదం కాస్త జఠిలమైంది. దీంతో మరోసారి డీఈఓ విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



హాజరైన నాయకులు, కార్యకర్తలు



శాంతమ్మ, ఈరలక్కప్పను పరిచయం చేస్తున్న పోకల అశోక్‌కుమార్

- నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధమవ్వాలి
- వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్

మడకశిర: రాబోవు ఎన్నికల్లో మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు సార్వత్రిక ఎన్నికలు చాలా కీలకమన్నారు. వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలంటే పార్టీ అభ్యర్థుల విజయమే అంతిమ లక్ష్యంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రజలను చైతన్య పరుస్తూ ఓటు అభ్యర్థించాలన్నారు. సామాజిక సమీకరణల్లో భాగంగా మడకశిర సమన్వయకర్తగా నిరుపేద కుటుంబానికి చెందిన ఈరలక్కప్పను, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా బోయ శాంతమ్మను అధిష్టానం నియమించిందని, వారిని ఆదరించాలని కోరారు.

బోయ శాంతమ్మ మాట్లాడుతూ.... సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును ఎవరూ విస్మరించడం లేదన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇంతటి సంక్షేమాన్ని ప్రజలకుఅ ందించింది లేదన్నారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ.... నిరుపేద కుటుంబానికి చెందిన తనపై గురుతర బాధ్యతను మోసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. పార్టీ కార్యకర్తలకు సదా అందుబాటులో ఉంటూ వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. సమావేశంలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకరరెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధనరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రవిశేఖర్ రెడ్డి, రంగేగౌడ్, వాగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జిల్లా కార్యదర్శులు కల్లుమర్రి శ్రీరాములు, బేకరి నాగరాజు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు బీఎల్ రామకృష్ణ, షాలిని, నాగరాజగౌడ్, ఎంపీపీలు కవిత, రేణుకమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు డీఎల్ యంజారేగౌడ్, స్టూడియో శ్రీనివాస్, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు హనుమంత రెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రివర్ణ పతాక ప్రదర్శనకు ఆహ్వానం

రొద్దం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కర్ణాటకలోని చింతామణిలో అతి పెద్ద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించే అవకాశం రొద్దం గ్రామానికి చెందిన కర్తదొంతి లక్ష్మీనారాయణ గుప్తాకు దక్కింది. ఈ మేరకు ఆ రాష్ట్ర అధికారుల నుంచి ఆయనకు ఆహ్వానం అందింది. దీంతో 18 మంది సభ్యులుగా ఉన్న తన బృందంతో ఆయన చింతామణికి బయలుదేరి వెళ్లారు. ఈ ఏడాది 2,200 అడుగుల పొడువైన త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించనున్నట్లు గుప్తా వివరించారు.

సమర్థవంతంగా పని చేయండి : ఎస్పీ

పుట్టపర్తి టౌన్: సమర్థవంతంగా పనిచేసి పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని సీఐలకు ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా కదిరి రూరల్, పెనుకొండ సీఐలుగా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్, మోహన్ గురువారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా వారికి ఎస్పీ సూచించారు.

యువకుడి బలవన్మరణం

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పుట్టగూర్లపల్లికి చెందిన కురుబ మంజునాథ్(31) ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఆయనకు పెళ్లి కాలేదు. దీంతో కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వాలంటూ తరచూ తల్లిదండ్రులతో గొడవపడేవాడు. బుధవారం రాత్రి డబ్బు కోసం తల్లిదండ్రులతో గొడవపడిన మంజునాథ్... ఆ తర్వాత మద్యం మత్తులో అదే రోజు రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి నారాయణప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రాణం తీసిన ప్రేమ



నవీన్‌కుమార్ (ఫైల్)

సోమందేపల్లి: ప్రేమించిన యువతి దూరం కావడాన్ని జీర్ణించుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం మండ్లి గ్రామానికి చెందిన రామాంజినప్ప కుమారుడు నవీన్‌కుమార్ (24) పెనుకొండ సమీపంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి ఇంటిపై గదిలో నిద్రించడానికి వెళ్లాడు. గురువారం ఉదయం ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు పైకి వెళ్లి చూశారు. గది తలుపులు తీయకపోవడంతో బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అప్పటికే పైకప్పుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. ప్రేమ వ్యవహారమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పెళ్లి చేయలేదని విద్యార్థి ..



అభిషేక్ (ఫైల్)

కుందుర్పి: ప్రేమించిన బాలికతో పెళ్లికి తలిదండ్రులు అంగీకరించకపోవడంతో ఓ విద్యార్థి (మైనర్) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం కరిగానిపల్లికి చెందిన సోమనాథ్, రుక్మిణమ్మ దంపతుల పెద్ద కుమారుడు అభిషేక్ (17) కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో తనకు పరిచయమైన ఓ బాలికతో ప్రేమలో పడ్డాడు. రెండు నెలలుగా ఈ వ్యవహారం కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు తెలిపి పెళ్లి చేయాలని పట్టుబడ్డాడు. ఈ వయసులోనే పెళ్లి వద్దని బాగా చదువుకుని ఉద్యోగం వచ్చిన తర్వాత అదే అమ్మాయితో పెళ్లి చేస్తామని, అప్పటి వరకూ బుద్ధిగా చదువుకోవాలని తండ్రి సోమనాథ్ తెలిపాడు. ఇందుకు అభిషేక్ అంగీకరించలేదు. తనకిప్పుడే పెళ్లి చేయాలని పట్టుబడ్డాడు. దీంతో అసహనానికి గురైన తల్లిదండ్రులు.... మైనారిటీ తీరకముందే పెళ్లి చేస్తే జరిగే అనర్థాలను కుమారుడికి వివరించారు. తాము చెప్పినట్లు నడుచుకోవాలన్నారు. దీంతో మనస్తాపం చెందిన అభిషేక్ గురువారం తెల్లవారుజామున తమ తోటలోకి వెళ్లి చింతచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం పొలానికి వెళ్లిన తండ్రి సోమనాథ్... చెట్టు వేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ..

అనంతపురం సిటీ: అనంతపురం–ధర్మవరం మార్గంలో గురువారం తెల్లవారుజామున రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(50) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు స్కై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ చొక్కా, బ్లూ కలర్ ఫుల్ డ్రాయర్, పింక్, వైట్ కలర్ నిలువు గీతలు కలిగిన లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం తెలిసిన 94406 27640, 94405 52808లో సంప్రదించాలని కేసు దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసులు కోరారు.

పేదరిక నిర్మూలనే ఆర్డీటీ లక్ష్యం

- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్



మాట్లాడుతున్న మాంఛోఫెర్రర్

కూడేరు: పేదరిక నిర్మూలనే ఆర్డీటీ లక్ష్యమని ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ తెలిపారు. గత ఏడాది నవంబర్ 17న విశాలఫెర్రర్ పేరుతో కూడేరులో మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆర్డీటీ సంఘాల్లోని మహిళలంతా రూ.500 చొప్పున చెల్లించి వాటాదారులుగా చేరారు. పొదుపు మొత్తం రూ.25లక్షలకు చేరుకుంది. దీంతో మహిళలకు రుణ సదుపాయాన్ని కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 195 మంది మహిళలకు రుణాలను చెక్ రూపంలో ఆయన అందజేసి, మాట్లాడారు. నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే ఫాదర్ ఫెర్రర్ ఆశయమన్నారు. ఆ ఆశయ సాధనలో భాగంగానే విశాల ఫెర్రర్ మహిళా కో ఆపరేటివ్ బ్యాంక్ ఆవిర్భవించిందన్నారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా తాము సంపాదించిన మొత్తంలో కొంత ఈ బ్యాంకుల్లో పొదుపు చేసుకోవాలని సూచించారు. వడ్డీ రూపంలో సమకూరే ఆదాయాన్ని డిపాజిట్ మొత్తంలోకి కలిపి సభ్యులంతా వాటాగా పొందవచ్చునన్నారు. అవసరాలకు తీసుకున్న రుణాన్ని ఆదాయ వనరులుగా మార్చుకోవాలన్నారు. రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా బ్యాంక్ సర్వతోముఖాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్, 40 మంది స్పెయిన్ దేశస్తులు, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఏటీఎల్ నల్లపరెడ్డి, ఎస్టీఎల్ హుస్సేన్‌బీ, సీఓలు సిద్ధప్ప, మధు, మహిళా బ్యాంకు బీఓడీలు పాల్గొన్నారు.

కార్యదర్శి అరెస్ట్

చిలమత్తూరు: స్థానిక పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ కర్ణాటకలోని బాగేపల్లి నుంచి మద్యం తరలిస్తూ కొడికొండ చెక్ పోస్ట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డాడ. గురువారం సాయంత్రం బాగేపల్లి వెళ్లిన కార్యదర్శి... ఉన్నతాధికారులకు పార్టీ ఇవ్వాలంటూ ఆరు బీర్లు, విందు భోజనాన్ని తీసుకుని వస్తుండగా కొడికొండ చెక్‌పోస్ట్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మధుసూదన్‌పై కేసు నమోదు చేసి, ఆయన ప్రయాణిస్తున్న కారును సీజ్ చేశారు.

ఆయుష్‌తో ఆరోగ్యం పదిలం

- ఆయుర్వేద ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి ఉషశ్రీచరణ్



ఆయుర్వేద ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: ఆయుష్‌తో ఆరోగ్యం పదిలమని పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. పరిగి మండలం సేవామందిరం అగ్రిగోల్డ్ కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల (ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్)ను గురువారం ఆమె ప్రారంభించారు. ఆయుర్వేద మందులను పరిశీలించి, వాటి వినియోగం వల్ల ఒనగూరే లాభాలను డాక్టర్ లావణ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకమ్మ, ఎంపీపీ సవిత ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఎంపీటీసీ సభ్యులు మారుతీరెడ్డి, చిక్కన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, సంతేబిదనూరు ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అనురాధ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో రెండు జింకల మృతి



మడకశిరలో మృతి చెందిన జింక



నల్లచెరువులో మృతి చెందిన జింక

నల్లచెరువు/ మడకశిర రూరల్: జిల్లా పరిధిలో గురువారం చోటుచేసుకున్న వేర్వేరు ప్రమాదాల్లో రెండు జింకలు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే... మడకశిర మండల పరిధిలో పెనుకొండ ప్రధాన రోడ్డులో గురువారం రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారి కుళ్లాయప్ప జింకను అటవీశాఖ కార్యాలయానికి తీసుకువచ్చారు. పశువైద్య అధికారులతో శవపరీక్ష నిర్వహించి కాల్చివేస్తామని ఆయన తెలిపారు. అలాగే నల్లచెరువు మండల పరిధిలోని ప్యాయలవాండ్లపల్లి బస్టాండు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీ కొని మరో జింక మృతి చెందింది. స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.



ఓటు మన భవిష్యత్తు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది బలమైన ఆయుధమని, ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. 18 సంవత్సరాలు పైబడిని ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ మాధవరెడ్డి హాజరయ్యారు. ఓటు హక్కు వినియోగంపై పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటరుగా నమోదు కావడాన్ని గర్వంగా భావించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, సీసీ రాఘవేంద్ర, ఆర్ఐలు రాజశేఖరరెడ్డి, టైటాస్, నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

తమ్ముని చేతిలో అన్న హతం

తనకల్లు: క్షణికావేశంలో తమ్ముడు కర్రతో దాడి చేయడంతో అన్న మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... తనకల్లు మండలం నడిమికుంటపల్లికి చెందిన సంజీవులు (30), వెంకటేష్ అన్నదమ్ములు. బుధవారం రాత్రి సంజీవులు చేపలు తీసుకుని ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఎదురుపడ్డ తమ్ముడి భార్య ప్రసన్నకు చేపలు ఇచ్చి కూర వండిపెట్టాలన్నాడు. అయితే అర్ధ రాత్రి కావడంతో ఆ సమయంలో చేయడం సాధ్యం కాదని, మరుసటి రోజు ఉదయం చేసిస్తానని ఆమె తెలిపింది. దీంతో తనకు మసాలాలు సిద్ధం చేసిస్తే తానే వండుకుంటానని సంజీవులు తెలపడంతో ఆమె మసాలా చేసిచ్చి భర్తతో కలసి మిద్దెపైకి ఎక్కి నిద్రపోయారు. చేపల కూర వండుకున్న సంజీవులు అన్నం తింటూ మద్యం మత్తులో తమ్ముడిని, కుటుంబసభ్యులను దుర్భాషలాడడం మొదలుపెట్టాడు. అసహనానికి గురైన వెంకటేష్ కిందకు వచ్చి అన్నను సముదాయించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో సంజీవులు మరింత రెచ్చిపోవడంతో క్షణికావేశానికి లోనైన వెంకటేష్ చేతికి అందిన చెక్క తీసుకుని సంజీవులు తలపై బలంగా కొట్టాడు. ఘటనతో తీవ్ర రక్తస్రావమై సంజీవులు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. హతుడి మేనత్త నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ లింగన్న తెలిపారు.

ఉత్తమ పర్యవేక్షణాధికారిగా హరిమోహన్



హరిమోహన్

కదిరి అర్బన్: ఆర్టీసీ కడప జోనల్ స్థాయిలో ఉత్తమ పర్యవేక్షణాధికారిగా కదిరి డిపోలో పనిచేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సంస్థ ఈడీ చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు

నల్లచెరువు: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త రాణి, సహాయకురాలు హంసవాహనికి ఐసీడీఎస్ అధికారులు మెమో జారీ చేశారు. ఈ మేరకు సీడీపీఓ గంగరత్నమ్మ నిర్ధారించారు. కేంద్రంలో వంటకాలు సరిగా లేవంటూ ఇద్దరూ తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగారు. ఈ అంశానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో గురువారం వైరల్ అయింది. దీనిపై సరైన వివరణ కోరుతూ మెమోలు జారీ చేసినట్లు సీడీపీఓ వివరించారు.